నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 1 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET

- నేటి నుంచి అమ్రాబాద్ టైగర్ సఫారీ బంద్
- మూడు నెలలు నిలిపివేత..
- ఎన్‌టీసీఏ సూచనల మేరకు నిర్ణయం
- వన్యప్రాణుల సంతానోత్పత్తికి అనుకూల సమయం
- ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ఏటీఆర్ ఫారెస్ట్

సఫారీ టూర్‌కు నో ఎంట్రీ

అచ్చంపేట, జూన్ 30 : నిత్యం జన సంచారంతో రద్దీగా ఉండే నల్లమల ప్రాంతం మూడు నెలలు మూగబోనున్నది. అమ్రాబాద్ టైగర్ సఫారీ ప్యాకేజీని నిలిపివేసింది. వన్యప్రాణుల సంతానోత్పత్తి సమయం ఆసన్నం కావడంతో నేటి నుంచి సెప్టెంబర్ 31 వరకు నల్లమలలో సఫారీ టూర్‌ను అధికారులు నిలిపివేశారు. అక్టోబర్ 1 నుంచి సఫారీ ప్యాకేజీ మళ్లీ ప్రారంభంకానున్నది. హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. శ్రీశైలం, ఉమామహేశ్వరం, మద్దిమడుగు ఆలయాల దర్శనానికి యాత్రికులు వస్తుంటారు. సఫారీ టూర్‌లో భాగంగా నల్లమల అందాలను తిలకించేందుకు యాత్రికులు ఇష్టపడుతుంటారు. కాగా మూడు నెలల పాటు సఫారీ ప్యాకేజీకి అధికారులు బ్రేక్ ఇచ్చారు. వన్యప్రాణుల సంతానోత్పత్తికి అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు ఈ చర్యలు చేపట్టారు. వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. ఈ మూడు నెలల పాటు నిబంధనలకు విరుద్ధంగా నల్లమలలోకి ప్రవేశిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ రహితంగా..

అమ్రాబాద్ పులుల అభయారణ్యాన్ని ప్రభుత్వం ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో జూలై 1 నుంచి నిబంధనలు అమల్లోకి రానున్నాయి. కాగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972, 1967 కింద చర్యలు తీసుకోనున్నట్లు అటవీశాఖ అధికారులు ప్రకటన విడుదల చేశారు. యాత్రికులు నిత్యం శ్రీశైలానికి నల్లమల మీదుగా వెళ్తూ ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు పారవేస్తుంటారు. ఈక్రమంలో వాటిని వన్యప్రాణులు తిని అనారోగ్యానికి గురవడం, అతివేగం వల్ల ప్రమాదాలతో వన్యప్రాణులు మృతిచెందుతున్నాయి. దీంతో ఈ నెల 1 నుంచి వాహనాల్లో ప్లాస్టిక్ కవర్లు, లీటర్‌లోపు ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకెళ్లినా.. వన్యప్రాణులకు ఆహార పదార్థాలు వేసినా, వాహనాల వేగం 30 కిలోమీటర్లకు మించినా రూ.వెయ్యి జరిమానాతోపాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు అటవీ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. అదేవిధంగా ప్లాస్టిక్ నిషేధంపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పిస్తూ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. శ్రీశైలం-హైదరాబాద్ మార్గంలోని మన్ననూరు నుంచి పాతాళగంగ వరకు ప్రయాణికులు ప్లాస్టిక్ వస్తువులు తరలించకుండా చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఇందుకు యాత్రికులు సహకరించాలని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి కోరారు.

సాసర్‌పిట్లలో నీటిని తాగుతున్న మూషిక జింకలు (ఫైల్)

30 పెద్దపులులు..

నల్లమల అభయారణ్యంలో పెద్దపులుల రక్షిత ఆవాసాలు ఎక్కువగా ఉన్నాయి. సాధారణంగా 104 నుంచి 106 రోజుల గర్భధారణ సమయం తరువాత ఆడపులి 1 నుంచి 4 పిల్లలకు జన్మనిస్తుంది. పొడవైన గడ్డి దట్టంగా ఉన్న ప్రదేశం, గుహలవంటి ఏకాంత ప్రదేశాలు లేదా దట్టమైన పొదల్లో పిల్లలను కంటుంది. నల్లమల ప్రాంతంలో 30 పెద్ద పులులు, 170 చిరుతపులులున్నాయి. పెద్దపులులు ఆహార గొలుసునకు ఎగువన ఉన్నాయి. ఇవి జింకలు, ఇతర శాఖాహార జంతువుల జనాభాను నియంత్రణలో ఉంచుతాయి. విస్తారమైన, దట్టమైన అటవీప్రాంతం పెద్దపులుల సంరక్షణకు ఉపయోగపడుతుంది. అడవులు ఒకపెద్ద స్పాంజి వలే నీటి వనరులను భద్రపరుస్తాయి. కార్బన్‌డై ఆక్సైడ్‌ను పీల్చుకుంటాయి. ఈవిధంగా అడవులు మానవజాతికి మరెన్నో అమూల్యమైన సేవలను అందిస్తున్నాయి.

వృక్ష సంపద

కృష్ణానదీ తీరాన ఉన్న ఆకురాల్చు పొడి అటవీ సముదాయం. నల్లమల.. కొండల గుండా విస్తరించి లోతైన లోయలు, అగాధాలతో నిండి ఉంటుంది. అడవిలో మర్రి, తెల్లమద్ది, యాప్రివృక్షం, మూళ్ల బురగచెట్టు, చింత, నేరేడు, టేకు, జిట్రేగి, గుగ్గిలం మొదలైన వృక్షజాతులు ఎక్కువగా కనిపిస్తాయి. అదేవిధంగా వివిధ రకాల మహావృక్షాలు కూడా ఈ పీఠభూమిపై కనిపిస్తాయి. 66 రకాల గడ్డిజాతులు ఈ ప్రాంతంలో ఉంటాయి. అదేవిధంగా సుమారు 350 రకాల ఔషధ మొక్కలున్నాయి.

పక్షి సంపద

నల్లమలలో సుమారు 350 పక్షి జాతులు నివాసముంటున్నాయి. ఇందులో 20 రకాల పక్షి జాతులు అరుదుగా కనిపిస్తాయి. ఫేసరిఫామ్ కుటుంబానికి చెందిన మైనాలు, కాకులు, పిచ్చుకలు, రాబిన్స్ ఈ ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తాయి. కొంగలు, బుట్టచప్పనాతి, బుల్‌బుల్, ఫ్లెక్యాచెర్ మొదలైన పక్షి జాతులను ఈ అడవిలో చూడొచ్చు. ఆకుపచ్చ పావురాలు, ఫ్రూట్ బ్యాక్ (అతి చిన్న గబ్బిలాలు), అత్యంత ప్రమాదకరమైన సాలె పురుగులు (జెమ్స్ స్పైడర్) ఇక్కడ మాత్రమే ఉన్నాయి. అంతరించిపోతున్న బట్టమేకపిట్టకు రోళ్లపాడు వన్యప్రాణి అభయారణ్యం నివాసంగా మారింది.

క్షీరదాల వైవిధ్యం

నల్లమల అభయారణ్యంలో సుమారు 70కి పైగా క్షీరద జాతులు గర్తించబడ్డాయి. క్షీరదాలు శరీరంపై బొచ్చును కలిగి, వాటి సంతానానికి పాలిచ్చే జంతు సమూహానికి చెందినవి. పెద్దపులి, చిరుతపులి, రేగుచుక్క, తోడేలు నల్లమలలో ఉంటే ముఖ్యమాంసాహార క్షీరదాలు. అరుదైన క్షీరదాలలో నీటికుక్క, ర్యాటల్, పునుగుపిల్లి, చేపలుపట్టుపిల్లి, రస్టీస్పాటెడ్ పిల్లి మొదలైనవి అరుదైనవి. బెట్టుడత, చెట్టుచుంచు, దుప్పి, బుర్రజింక, కృష్ణజింక, కొండగొర్రె, మనుబొతు, అడవిపంది, చుక్కల జింక, జంగంపల్లి, ముళ్లపంది వంటి క్షీరదాలు నల్లమల ప్రాంతంలో కనిపిస్తాయి. సహజంగా ఉండే ఉడుత కంటే మూడురెట్లు పెద్దదిగా ఉండే 'బిట్టుడుత' నల్లమల అటవీ ప్రాంతంలోనే కనిపిస్తుంది. నెమళ్లు, జింకలు, కోతులు వేలసంఖ్యలో కనిపిస్తాయి.

అటవీసంపద

దేశంలోనే రెండో అతిపెద్ద అభయారణ్యప్రాంతంగా నల్లమల 2611 చ.కి.మీ.లలో విస్తరించి ఉన్నది. సుమారు 130 కి.మీ.లకు పైగా కృష్ణా నది నల్లమల ప్రాంతం మీదుగా ప్రవహిస్తున్నది. ఈ ప్రాంతం 1983లో అభయారణ్యంగా ప్రకటించబడింది. 2014లో తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత అమ్రాబాద్ టైగర్ రిజర్వుగా ప్రకటించారు. నల్లమల ప్రాంతంలో లోతైన లోయలతో కూడిన కొండలు కనిపిస్తాయి. అమ్రాబాద్, శ్రీశైలం, పెద్దచెరువు, శివపురం, నెక్కంటి మొదలైన పీఠభూములు ఈ ప్రాంతమంతా విస్తరించి ఉన్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ ప్రాంతమంతా భారీ వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలో అడవి జంతువులు పీఠభూములకు పరిమితమై ఉంటాయి. వేసవికాలంలో జంతుజాలం లోయలలో నిత్య నీటివనరుల ప్రాంతాలకు తరలిపోతుంటాయి.

రైతుభరోసా ఏమైంది?

- హామీలను తుంగలో తొక్కిన సర్కారు
- రూ.2లక్షల రుణమాఫీ చేయాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వెల్దండ, జూన్ 30 : రైతాంగాన్ని కాంగ్రెస్ సర్కారు నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, రైతు భరోసాపై స్పష్టత ఇవ్వాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కారు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర హామీలను విస్మరించి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో 1.52 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. అందులో కోటి ఎకరాలు చిన్న సన్నకారు రైతులదే ఉన్నదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేయాలన్నారు. ఎన్నికలకు ముందు రూ.15వేల రైతుభరోసా ఇస్తామని చెప్పి, ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. వలసల నివారణ కోసం కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంట్, రైతుబీమా వంటి పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. పంటకు పెట్టుబడి కోసం సాగుకు ముందే రైతులకు రైతుబంధు సాయం అందించేదని వివరించారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమకారుడు స్కైలాబ్ తల్లి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి , మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు పుట్టా రాంరెడ్డి, శేఖర్, విజయ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నిరంజన్, నర్సింహ, శ్రీను, ప్రసాద్, అశోక్, కొండల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

పూర్వవైభవం తీసుకొస్తాం

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మక్తల్, జూన్ 30 : కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పార్టీలో సైనికుల్లాంటి కార్యకర్తలున్నారని, త్వరలోనే పార్టీ మరింత బలపడుతుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి స్వగృహంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కేసీఆర్ సంకల్పంతోనే తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందన్నారు. ప్రాణాలకు తెగించి ఢిల్లీ నాయకుల మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం బీడుభూములన్నింటికీ సాగునీరందించి పచ్చటి మాగాణులుగా మార్చారన్నారు. పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా మార్చిన గొప్ప నాయకుడని కొనియాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. రేవంత్‌కు తన పదవిపై నమ్మకం లేక ఏం చేయాలో తెలియక రాష్ట్ర రైతాంగాన్ని కరెంట్ కష్టాలతో ఇబ్బంది పెడుతున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక.. కేసీఆర్ అప్పులు చేశారని ప్రజలకు తప్పుడు మాటలు చెబుతూ పరిపాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. త్వరలోనే కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ మరింత బలపడి మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం చిట్టెం సమక్షంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఊట్కూర్ జెడ్పీటీసీ అశోక్‌గౌడ్, మాగనూరు జెడ్పీటీసీ వెంకటయ్య, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వెంటే ఉంటా..

- ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ వీడను
- రాజకీయాలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలి
- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- బీఆర్ఎస్‌కు పునర్‌వైభవం : జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, జూన్ 30 : కేసీఆర్ నాయకత్వంలో దమ్మున్న బీఆర్ఎస్ వెంటే ఉంటానని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్సీకి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ తాను పార్టీ మారనన్నారు. సీఎం సొంత జిల్లాలోనే తాను ఎమ్మెల్సీగా గెలిచానని.. ఎన్ని డబ్బులున్నా.. అధికారం ఉన్నా నిజాయితీకి తలొగ్గాల్సిందేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతూ రాజకీయాలు చేయడం మానుకొని, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై తప్పకుండా శాసనమండలిలో ప్రస్తావిస్తానన్నారు. ఒకవేళ జిల్లాలను రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ నిధుల కేటాయింపులో పేటకు ప్రాధాన్యమిస్తామన్నారు. సీఎం తమ్ముడికి ఎలాంటి హోదా లేకున్నా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తుంటే ధైర్యంగా అడ్డుకున్న దౌల్తాబాద్ జెడ్పీటీసీ మహిపాల్‌రెడ్డిని అభినందించారు. కాంగ్రెస్ అంటేనే 12 మంది సీఎంల జట్టు అని.. ఎంపీ ఎన్నికల ఫలితాల తర్వాత సీఎం బలహీనత అర్థమై ఆ పార్టీలో వర్గ విబేధాలు మొదలయ్యాయన్నారు. పాలమూరు ప్రజలు ఎంతో విశ్వాసం ఉన్నవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయిందన్నారు. కష్టకాలంలో పార్టీకి, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. తెలిసీ తెలియక పార్టీ వీడిన వారు తిరిగి రావాలని కోరారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ విజయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పాలమూరు ఎంపీగా కేసీఆర్ గెలవడం వల్లే రాష్ట్రాన్ని సాధించుకున్నామని.. మహబూబ్‌నగర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గెలుపొందడంతో పార్టీకి పూర్వవైభవం రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. పీఆర్ఎల్ఐ, జిల్లాల రద్దు విషయంపై ఉమ్మడి జిల్లా తరపున వాణి వినిపించాలని కోరారు. అనంతరం నవీన్‌కుమార్‌రెడ్డిని రాజేందర్‌రెడ్డితోపాటు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సురేఖ, ఎంపీపీలు నర్సప్ప, శ్రీనివాస్‌రెడ్డి, శశికళ, జెడ్పీటీసీలు అంజలి, లావణ్య, విజయ్‌సింహారెడ్డి, కౌన్సిలర్లు గురులింగ్, శిరీషాచెన్నారెడ్డి, నాయకులు విజయసాగర్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జగదీశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

నీరు లేక బోసిపోయిన కృష్ణానది

నాడు గలగల.. నేడు వెలవెల

వానకాలం ప్రారంభమై నెల కావొస్తున్నా వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పెబ్బేరు మండలం రంగాపురం వద్ద ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంతం ఇప్పటికీ రాళ్లు తేలి కళావిహీనంగా కనిపిస్తున్నది. వర్షాలు సకాలంలో కురిస్తే ఇప్పటికే నదులు, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడేవి. సాగు పనులు కూడా మొదలయ్యేవి. జూరాల ప్రాజెక్టు నిండి క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలైన నీళ్లు బీచుపల్లి మీదుగా శ్రీశైలానికి పరుగులు పెట్టేవి. కానీ ప్రస్తుతం కృష్ణానది చుక్కనీరు లేక బోసిపోయి కనిపిస్తున్నది. - పెబ్బేరు, జూన్ 30

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 30 : విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ప్యారడైజ్ కన్వెన్షన్ హాల్‌లో గౌడ, విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి హాజరై వివిధ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి సన్మానించారు. అదేవిధంగా ప్రమోషన్ పొందిన ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉన్నతంగా చదివి ప్రతిభ కనబర్చిన వారికి గౌడ అసోసియేషన్ తరపున సన్మాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, గ్రేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సాయిలుగౌడ్, గౌడ హాస్టల్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తిగౌడ్, పురుషోత్తంగౌడ్, శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.